క్లుప్తంగా

రాముకు వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



రామును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తాతపూడి రాము కొన్ని రోజులుగా తీవ్ర విషజ్వరంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ చాంద్‌బాషా రాము నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించి ఆరోగ్యంపై చర్చించారు. పరామర్శించిన వారిలో గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కొన్నలగడ్డ గోవిందయ్య, జిల్లా ఎస్సీసెల్ నాయకులు పోతుల రమేష్ బాబు, నిమ్మజవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, కాలేషా, తాతపూడి ఎలీషా, దండే తిరుపతి, టి.రోశయ్య, నరసయ్య ఉన్నారు.

మర్రిపాడు నేతలకు కూడా..

టంగుటూరు: మండలంలోని మర్రిపాడు గ్రామంలో వైఎస్సార్ జయంతి, వినాయకుడి నిమజ్జన కార్యక్రమాల్లో జరిగిన ఘర్షణలపై వైఎస్సార్ సీపీ వర్గీయులపై నమోదైన అక్రమ కేసుల్లో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై గురువారం విడుదలైన వారిని ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సింగమనేని బ్రహ్మయ్య, ఉదర అమర్నాథ్ చౌదరి, మరో ముగ్గురు బెయిల్‌పై విడుదలవగా, వారిని ఆ పార్టీ టంగుటూరు మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు, మండల మాజీ అధ్యక్షుడు సుదనగుంట శ్రీహరిరావు, మల్లవరపు కోటిరెడ్డి, వల్లం రెడ్డి రమణారెడ్డి, తదితర నాయకులు జిల్లా జైలు వద్ద కలిసి పరామర్శించారు.

388 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి: కొండపి వేలం కేంద్రం పరిధిలోని చవటపాలెం, దాదానాయుడుపాలెం, రామాయపాలెం, కొండపి, దాసిరెడ్డిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 988 బేళ్లను శుక్రవారం వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 600 బేళ్లను కొనుగోలు చేసిన వ్యాపారులు.. వివిధ కారణాలతో 388 బేళ్లను తిరస్కరించారు. కేజీ పొగాకు గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.110, సరాసరి ధర రూ.201.80 నమోదైంది. వేలంలో 18 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని వేలం కేంద్రం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు.

టంగుటూరులో 285 బేళ్లు..

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలోని చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం 971 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 686 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా, 285 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.330 పలకగా, కనిష్ట ధర రూ.125 పలికింది. సరాసరి రూ.229.37 పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హ్యాపీ కిడ్స్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ అఫ్జల్

కొండపి: సింగరాయకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన టార్గెట్ బాల్ సెలక్షన్స్‌లో కొండపి హ్యాపీ కిడ్స్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్ అఫ్జల్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కె.నిరీక్షి, బి.బ్రహ్మచారిణి సెప్టెంబర్ 13, 14 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే మూడో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ లో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్నికైన విద్యార్థులను కరస్పాండెంట్ అఫ్జల్, ప్రిన్సిపాల్ కోటూరాజు, పీఈటీ నాగరాజు అభినందించారు.

సర్పంచ్‌ల బిల్లుల సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న గుంటక తిరుపతిరెడ్డి

వెలిగండ్ల (కనిగిరి రూరల్): పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసిన ప్రజాప్రతినిధులకు (సర్పంచ్‌) బిల్లుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతి రెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన జెడ్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించక పోవడంతో బిల్లులు మంజూర్ కాకున్నా ఆర్థికలు వర్సిగా అవి కాగితాల్లోనే ఉన్నట్లు తెలిపారు. బిల్లుల నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ కాకపోవడంతో సర్పంచ్‌లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను కోరినట్లు గుంటక తిరుపతిరెడ్డి వెల్లడించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో యూటీఎఫ్ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పామూరు: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల శ్రీనివాసులు, షేక్ భాజామస్తాన్, జిల్లా కౌన్సిలర్ మల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన వారం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామచంద్రుని వానుదేవరావుకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పామూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్రంలో తలపెట్టిన యూటీఎఫ్ రణభేరి ప్రచార బైక్ జాతాను జయప్రదం చేయాలని సంఘ నాయకులు పేట తిరుపతిరెడ్డి, డోలా ఉదయ్, ఎం.సురేష్ కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 25న విజయవాడలో తలపెట్టిన రణభేరి బహిరంగ సభ, ప్రచార బైక్ జాతా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బోధనేతర ఉపాధ్యాయులను పరిమితం చేయాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలన్నారు. ఎం.రామారావు, నరసింహారావు, కె.నాగేశ్వరరావు, బి.సత్యం, బి.మాధవరావు, పార్థసారథి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్, డీఏ బకాయిలు ఇంత వరకు విడుదల కాలేదన్నారు. ఆర్థిక సంబంధ సమస్యలు ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులకు 4 డీఏలు తక్షణమే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిటీ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ సంఘ సభ్యులు సుబ్బయ్య, మోహన్‌రావు, మాలకొండయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

సీఎస్‌పురం (పామూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని, తక్షణం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు



తహసీల్దార్ జనార్ధన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

తోట శ్రీనివాసులు, జీఎస్ ఆనంద్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సీఎస్‌పురం ఎంఈఓ కార్యాలయం వద్ద, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. మెమో 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్సీని నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్స్ చెల్లించాలన్నారు.

కనిగిరి రూరల్: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం రణభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలని, 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించి తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 11వ పీఆర్సీ అరియర్స్, డీఏ అరియర్స్ చెల్లించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ఉత్తర్వుల మేరకు ఓపీఎస్ అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, మున్సిపల్ ట్రైబల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వర్గంలోని ఉపాధ్యాయులను చైతన్యపరిచే విధంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. భారీ బహిరంగ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. తొలుత వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్‌కే ఖాజా రంతుల్లా, ఎం.రామ, మల్లికార్జున, పట్టం నరసింహా, నాగార్జునరెడ్డి, బ్రహ్మయ్య, సుబ్బారెడ్డి, శేషగిరి, ఏసుబాబు, రమేష్, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.కృష్ణమూర్తి పాల్గొన్నారు.



టంగుటూరులో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మర్రిపూడి: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బీడీ కిషోర్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలపై స్థానిక తహసీల్దార్ జనార్ధన్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. మెమో 57ను తక్షణమే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, రమేష్, వెంకటరెడ్డి, రాంబాబు ఉన్నారు.

నాలుగు డీఏలు విడుదల చేయాలి...

టంగుటూరు: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన వారం నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్ రవి, రాష్ట్ర కార్యదర్శి విజయసారథి, సుబ్బారావు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ నెల15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రంలో తలపెట్టిన యూటీఎఫ్ రణభేరి ప్రచార బైక్ జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారెడ్డి వెంకట రామయ్య, షేక్ పాదుషా కోరారు. శుక్రవారం మండలంలోని శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాలలో రణభేరి బహిరంగ సభ, ప్రచార బైక్‌జాతా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కాకపోతే ఈ నెల 25న విజయవాడలో రణభేరి బహిరంగసభ నిర్వహిస్తామన్నారు.

పోరాట యోధుడు.. సీతారాం ఏచూరి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు




వర్ధంతి సభలో మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కొండపి: ఐదు దశాబ్దాల పాటు అరుణ బావుటా నీడలో సాగిన సీతారాం ఏచూరి జీవితం ఆజరామరమైనదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం పెరిదేపిలో ఎల్ఐసీ స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల కోసం తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసిన యోధుడు మరణం లేదన్నారు. వారి సేవలు ప్రజల హృదయాల్లో జీవించే ఉంటాయన్నారు. విద్యార్థినేతగా రాజకీయాల్లోకి ప్రవేశించిన సీతారాం ఏచూరి మరణించే వరకు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో ముందున్నారు... నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష రాజకీయాల్లో క్రియాశీలకమైన పాత్ర పోషించారన్నారు. నాటి ఎమర్జెన్సీ కాలంలో నిర్బంధాన్ని ఎదుర్కొన్న నేత ప్రధానమంత్రి పైతం ఉద్యమ బాటకు రప్పించిన సమస్యల సాధనకు పోరాటాలే మార్గమని రుజువు చేశారని తెలిపారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, పరిశుద్ధరావు, పెద్ద పేతురు, చిన్న పేతురు, బ్రహ్మయ్య, విశ్రాంత, సూరిబాబు, వందనం, శ్రీనివాసరావు, జకర్య, ఆంజనేయులు, ఆశీర్వాదం, కరుణ, చిన్నారావు, మమత, సురేష్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కనిగిరి రూరల్: సీపీఎం జాతీయ నాయకుడు, దివంగత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం కోసం వామపక్ష సిద్ధాంతాలతో సామాజిక న్యాయం కోసం సీతారాం ఏచూరి ఎనలేని పోరాటాలు చేశారని కీర్తించారు. నాయకులు వి.కాశయ్య, పి.నరేంద్ర, నాగరాజు, బోపేవలి, కొండయ్య, రత్తమ్మ, పిచ్చయ్య పాల్గొన్నారు.

తీరప్రాంత పరిరక్షణపై మత్స్యకారులకు అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ

సింగరాయకొండ: తీరప్రాంత భద్రత, పరిరక్షణపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని, మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయాలని రామాయపట్నం మెరైన్ సీఐ జి.శివన్నారాయణ సూచించారు. మండలంలోని పాకల పల్లెపాలెంలో శుక్రవారం మత్స్యకారులకు తీరప్రాంత భద్రతపై సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి మత్స్య శాఖాధికారి గోరింకల్ మాట్లాడుతూ ఆలివ్‌రిడ్లే తాబేళ్ల ప్రాముఖ్యత, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. తీరంలో తాటి చెట్లు పెంచడం వలన కలిగే ప్రయోజనాలు, గోస్ట్ నెట్ల వలన కలిగే నష్టాలను వివరించారు. తీరంలో కొత్త వ్యక్తులు, బోట్లు కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1093, 1554కు ఫోన్ చేయాలని సూచించారు. చేపల వేటకు వెళ్లే సమయంలో లైఫ్ జాకెట్లు ధరించాలని, బిల్లరులు తీరంలో కలిసి మన దేశ భూభాగంలోకి చొరబడకుండా కోస్టగార్డు సిబ్బందికి మత్స్యకారులు సహకరించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్‌వీబీ రాజేష్, మెరైన్ ఎస్సై పి.శ్రీశైలయ్య, షేక్ మస్తాన్ షరీఫ్, ఒంగోలు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.నరసింహారావు, రామాయపట్నం పోర్టు డీఈ ఎం.మస్తానరావు, ఏఎస్సై పీవీ రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ ఎస్.చంద్రశేఖర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకాలు అందించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫూర్

కనిగిరి రూరల్: చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బుల్లు సేకరించే వారిని సమగ్రంగా పూర్తి స్థాయిలో గుర్తించి సామాజిక భద్రత పథకాల్లో భాగస్వాములను చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో శుక్రవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ భాగస్వామ్యంతో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు, సేకరించి జీవనం సాగించే కార్మికుల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ టి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ నమస్తే పథకం ద్వారా వేస్ట్ పికర్ల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధార్‌లో లేని వేస్ట్ పికర్లను గుర్తించి వారికి ఆధార్ కార్డుల జారీకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్‌బాబు, జి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

ఎస్సై వెంకటేశ్వర నాయక్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

పామూరు: ప్రజా సమస్యలపై చర్చించేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ప్రజాసంఘాల కార్యకర్తలను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన సీఎస్‌పురం ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్‌ను, స్టేషన్‌లో అక్రమాలకు, అవినీతి వసూళ్లకు పాల్పడుతున్న కానిస్టేబుల్ చంద్ర నాయక్‌పై చర్యలు తీసుకోవాలని, వారిని సస్పెండ్ చేసేదాకా పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు హెచ్చరించారు. సీపీఎం జిల్లా నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు పట్ల ఎస్సై, కానిస్టేబుల్ తీరును నిరసిస్తూ శుక్రవారం పామూరులోని సుందరయ్య భవన్ సెంటర్‌లో జిల్లా కమిటీ సభ్యులు కె.మాల్యాద్రి అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వినాయకచవితి పందిరికి ప్రభుత్వం అన్ని ఉచిత అనుమతులు ప్రకటిస్తే ఎస్సై వినాయక విగ్రహం ఏర్పాటుకు రూ.2 వేలు, డీజేకు రూ.20 వేలు, పాటకచేరికి రూ.40 వేల రేట్లు నిర్ణయించి అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు. సీపీఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమ్మి, సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, ఎస్.తిరుపతిరెడ్డి, రత్నారెడ్డి, యాటా వీరనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఎంపీడీవో రామాంజనేయులుకు సమ్మె నోటీసు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కొండపి: సచివాలయ ఉద్యోగుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవో రామాంజనేయులుకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పీ-4 విధానంలో క్లస్టర్ మ్యాపింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖలకు అప్పగించాలని కోరారు. సెలవులు, పండుగలు, ఆదివారాలలో బలవంతంగా పనులు చేయిస్తున్నారని, వాటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. వలంటీర్ విధులు తమకు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండలంలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం



కరపత్రాల ఆవిష్కరణలో ఏఐవైఎఫ్ నాయకులు

కనిగిరి రూరల్: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం చేయడంలో కూటమి సర్కార్ విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం పుట్టా సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో పోతల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రకటించిన రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ, యువత, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాల యువతకు సమానంగా అవకాశాలు కల్పించాలని, పరిశ్రమల్లో 70 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, టీచింగ్, నాన్ టీచింగ్, లైబ్రరీ, పోస్టులు, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వలంటీర్లను విద్యారంగ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న విజయవాడలో జరిగే నిరుద్యోగుల ఆవేదన సదస్సుకు నిరుద్యోగ, యువతీ, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు గులాం హుస్సేన్, మాధవస్ పూర్ణచంద్రరాజు, మీరావలి, పవన్ కళ్యాణ్, ఖాశింపీరా, నజీముద్దీన్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన ఎంపీపీ

మర్రిపూడి: రోడ్లు అధ్వానంగా ఉన్న విషయంపై ఎన్ని సమావేశాల్లో అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోతుందని మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన నిలదీశారు. పొదిలి-టంగుటూరు రహదారి మండల పరిధిలో ఛిద్రమై పదేళ్లు దాటినా నేటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో మండల వాసులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రహదారుల మరమ్మతుల గురించి చెప్తుండగా... క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి సంబంధం ఉండటం లేదన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. ప్రధానంగా రేగలగడ్డ బస్టాండ్ వద్ద నుంచి మర్రిపూడి జూనియర్ కళాశాల వరకు రహదారి పూర్తిగా ఛిద్రమై రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. వర్షాల సమయంలో చెరువు కట్ట కింద ప్రయాణం నరకప్రాయంగా ఉందన్నారు. ఆర్‌అండ్‌బీ రహదారి అనుకుని ఉన్న నేలబావుల రక్షణ గోడలు కూలిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉన్న విషయం ఉన్నతాధికారులకు ప్రత్యక్షంగా చూపించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పొరపాటున వాహనదారులు ఆ బావుల వద్ద అదుపు తప్పితే సుమారు 40 అడుగుల గోతిలో పడిపోతారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి నిలదీశారు. తక్షణమే చర్యలు తీసుకుని రహదారి అభివృద్ధికి కృషిచేయాలని సభాముఖంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని గార్లపేట రోడ్డు, కాశిరెడ్డి బజారు, పామూరు రోడ్డు సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాజరు పట్టీలు, మెమొంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మేనేజర్ ప్రసాద్‌రావు, నోడల్ అధికారులు ప్రదీప్, పూర్ణిమ, కొండయ్య, వెంకటేష్, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

కొండపి: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఒంగోలు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.హిమావతి అన్నారు. శుక్రవారం కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, హైమవతి ఆధ్వర్యంలో 32 బృందాలు మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అనధికారికంగా కేటగిరీ మార్చి విద్యుత్ వాడుతున్న సర్వీసులు, విద్యుత్ చౌర్యం చేసిన 27 సర్వీసులను గుర్తించి దాదాపు 2.50 లక్షల రూపాయల అపరాధ రుసుం విధించామని తెలిపారు. కార్యక్రమంలో సింగరాయకొండ డీఈఈ యుగంధర్, ఏఈ ఫ్యాన్సీ శ్రీనివాసులు, కందుకూర్ డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బర్లీ పొగాకు సాగు వద్దు

కొండపి: మండలంలోని రైతులు నల్ల బర్లీ పొగాకు సాగుచేయవద్దని ఏడీఏ నిర్మలాకుమారి సూచించారు. శుక్రవారం మండలంలోని అనకర్లపూడి, ముప్పవరం, పెట్లూరు గ్రామాల్లో నల్ల బర్లీ పొగాకు సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధించిందన్నారు. జీవో నంబర్ ఆర్టీ 740 నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు నర్సరీలను కూడా నిషేధించిందని, రబీ సీజన్లో నల్ల బర్లీ పొగాకు సాగుచేయవద్దని తెలిపారు. రైతులు సాగు చేసినా ప్రభుత్వం కొనుగోలు చేయదని, దానివలన రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అనంతరం పొగాకు నారుమడులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో మాల్యాద్రి, ఏఈఓ కుమార్, వీఏఏ పవిత్ర, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: హనుమంతునిపాడు మండలం జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమని, మండల రైతుల సమస్యలను పరిష్కరించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీపీ గాయం సావిత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నిమ్మసాగు, పొగాకు సాగు చేశారన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక నష్టాల్లో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు పండించిన పంటకు సాగు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సమావేశంలో ఆమె కోరినట్లు తెలిపారు.

అండర్-19 రగ్బీ పోటీలకు కొండపి విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థులు హన్సా, లేఖన, జెస్సీ

కొండపి: సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్ రగ్బీ సెలక్షన్స్‌లో కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సయ్యద్ జిలానీ భాషా తెలిపారు. జి.హన్సా, డి.లేఖన, జె.జెస్సిలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.